# స్వయంకృతం

"ఎక్కడికి ప్రయాణం అవుతున్నావు" అని అడిగాడు. గోపాలం పెట్టె సర్దుకుంటున్న భార్య శ్యామలను చూచి.

శ్యామల మాట్లాడలేదు. రుసరుసమంటూ పెట్టె దభాలున మూసింది. తన భార్య చాలా కోపంగా వుందని అతను గ్రహించాడు. ఇటీవల చీటికీమాటికీ తన భార్యకు కోపం రావటం, చాలా స్వల్పవిషయాలమీద కీచులాడటం జరుగుతూ వుంది. అతనికి చాలా కష్టంగా వుంటూవుందిగాని ఎంత ఆలోచించినా, ఆమె ప్రవర్తనకు తగిన కారణం అగుపించేది కాదు. అందుకని కాలమే అన్నీ చక్కబరుస్తుందనే విశ్వాసంతో మెదలకుండా ఊరుకుంటున్నాడు.

"మాట్లాడవేం!" అన్నాడు గోపాలం.

"నాకు ఎవరితో మాట్లాడవలసిన అవసరంలేదు. నేను మా అన్నయ్యదగ్గరకు వెళ్ళిపోతున్నాను" అన్నది శ్యామల. అని పెట్టె తీసుకొని బయటకు బయలుదేరింది.

గోపాలం కొరడా దెబ్బ తిన్నట్లు వులిక్కి పడ్డాడు. అతనికి ఒక్క క్షణం ఏమీ అర్థంకాలేదు. కళ్ళయెదుట జరుగుతున్నది నమ్మలేకపోయాడు. తనభార్య, తనశ్యామల తన్ను విడిచి వెళ్ళటమా? ఎందుకు? తనేంచేశాడు! తనతో కాపరం చెయ్యటంకంటే, వీధుల్లో నిరాధరంగా తిరగటమే నయం, అనుకునే బాధ ఆమెకు తనేం కలిగించాడు? ఈ ఆలోచనలన్నీ అతని మనోవీధిలో ఒక్కసారి విరిసినై.

అప్రయత్నంగా "మళ్ళీ ఎప్పుడొస్తావు శ్యామలా!" అని అడిగాడు. అతని కంఠం వొణికింది. రుద్ధమయింది.

ఆ కంఠధ్వనికి రివ్వున వెనక్కుతిరిగింది శ్యామల. కోపంతో ఆమె ముఖం యెఱ్ఱబడింది. కట్టలు తెంచుకోటానికి ప్రయత్నిస్తున్న ఆమె ఉద్రేకంతో ఉక్కిరిబిక్కిరి అవుతూవుంది. హృదయం దడదడలాడింది.

"ఇంకా సిగ్గులేక అడుగుతున్నారా! నేను రాను. నా గొంతులో వూపిరి వుండగా మీ మొహం చూడను. అడుక్కొని అయినా బతుకుతాను. చావనన్నా చస్తాను......" ఇక వాక్యం పూర్తిచెయ్యలేక పోయింది.

"ఎందుకు నేనేం చేశాను!" అన్నాడు గోపాలం ఆమె నిష్ఠురోక్తులనుంచి తప్పించుకోటానికి మొహానికి చెయ్యి అడ్డంపెట్టుకొని అడిగాడు. అడగలేదు. తన్ను తానే ప్రశ్నించుకున్నాడు. ప్రశ్నించుకోలేదు. తన్ను తానే తిట్టుకున్నాడు. తిట్టుకోటంకాదు. తన్ను తానే శిక్షించుకున్నాడు.

శ్యామల అతని మానసిక స్థితిని అర్థంచేసుకునే స్థితిలో లేదు. తోకతొక్కిన పాముల్లే లేచింది. "ఇంకా ఏం చేశానంటున్నారా? నన్నింట్లో కట్టిపడేసి, దాసీదానికంటే కనాకష్టంగా చూస్తూ, రాత్రింబగళ్లు ఇష్టంవొచ్చినట్టు తిరిగి వొస్తూ.... నేనేం మనిషిననుకున్నారా! పశువుననుకున్నారా? చీరెలూ జాకెట్లూ ఇన్ని నా మొహాన వేసి రోజుకి యింత అన్నం పడేస్తే చాలు అనుకున్నారా! ఇష్టం వొచ్చినట్టు ఆడవొచ్చు అనుకున్నారే! మీవంటి స్వార్థపరులకు, మోసగాళ్ళకు భార్యగా ఉన్నదానికంటే, నాలుగు ఇళ్ళల్లో అట్లుతోముకొని బ్రతకటం మేలు" అన్నది.

శ్యామల ఇంత తీక్ష్ణంగా. ఇంత ఉద్రేకంగా మాట్లా గోపాలానికి అసలు సంగతి అర్థంకాలేదు. సంభ్రమాశ్చర్యాలతో కళ్లు అప్పగించి విన్నాడు. చివరికి గుక్కతిప్పుకొని, "నీకెందుకంతకోప ? నేనేం చేశానని? పోనీ, కారణం చెప్పు" అన్నాడు.

"పిల్లి కళ్ళుమూసుకొని పాలుతాగుతూ, ఎవ్వరూ నన్ను చూట్టంలేదు. అనుకుంటుందట? ఈ నాలుగు నెలల్నుంచీ మీ ప్రవర్తన నేను గమనించటంలేదు అనుకున్నారేం'-దాన్దేముంది మొద్దు. అంతగా అనుమానిస్తే 'ఒకజాకెట్టు గుడ్డ కొనిపెడితే అదే సంతోషిస్తుంది' అనుకున్నారే ... ఈ నాలుగు నెలల్నుంచీ మీరు వొక్కపూట ఇంటికి వేళకు వచ్చారూ... రాత్రిళ్లు పన్నెండు గంటలముందు ఎప్పుడన్నా వొచ్చారూ!..."

శ్యామల గుక్క తిరక్కుండా అతను చేసిన నేరాలు ఏకరువు పెడుతూవుంది. అతను ఇక వినలేక ఇలా అన్నాడు. "నువ్వు లేనిపోనివన్నీ ఊహించుకొని బాధపడుతున్నావు నాకు యెన్నిపనులున్నవీ నీకు తెలుసు. కోడూరు గ్రామం లో వరదలవల్ల పంటలన్నీ నష్టపడ్డయ్ బీదవాళ్లు తలదాచుకో టానికి ఇళ్లూవాకిళ్లూ లేక, తింటానికి తిండిలేక అల్లాడి పోతున్నారు. వాళ్లకోసం చందాలు పోగుజేస్తున్నారు అది నీకు తెలిసివుండికూడా ఇల్లా అనుమానిస్తే నేనేం చెయ్యను. దేశసేవ చెయ్యటంకూడా తప్పే అయిపోయిందా? నువ్వు తెలిసినదానివి...."

"ఇక ఆపండి" అంది శ్యామల. ఈ మాయమాటలు చెప్పే నన్నీస్థితికి తీసుకువొచ్చారు. దేశసేవ, చందాలు అని నన్ను నమ్మించి మీరు యశోదతో తిరగటం యెవ్వరికి తెలియదు..."

"శ్యామలా!" అని కోపంతో తన్ను తాను మరచి పోయి రెండడుగులు ముందుకు వేశాడు గోపాలం

"మీరు చేస్తున్న పనులన్నీ నాకు తెలుసు. ఆ మాటా ఈ మాటా చెప్పి నన్ను ఇంటిలోపెట్టి, ఇష్టంవచ్చినట్లు తిరిగి వచ్చి నాకు బూటకం మాటలు చెపుతున్నారు. నేను ఎంత తెలివితక్కువ దాన్నయితేమాత్రం ఈ మాత్రం తెలుసుకో లేను అనుకున్నారా? నన్ను వంటకత్తె కంటే కనాకష్టం చేశారు. మీకు అహోరాత్రులు చాకిరీ జేస్తున్నందుకు కట్టు కోటానికి గుడ్డా, తింటానికి ఇన్ని మెతుకులూ వేస్తున్నారు. ఈ

అవమానం నేను భరించలేను. మీా యశోదతో ఇక మీా ఇష్టంవొచ్చినట్లు ఊరేగండి. పార్కులూ, కాఫీహోటళ్లూ, మీాటింగులూ అన్నీ వెంటవేసుకొని తిప్పండి'' అని పెట్టె తీసుకొని చరచరా వెళ్ళిపోయింది.

గోపాలం తలతిరిగింది. నోట మాటలేదు. అలాగే చతికిలబడ్డాడు. గతించిన తమ జీవితం ఒక్కసారి తలలో తిరిగింది.

వివాహానికి ముందునుంచీ తాను రాజకీయాలలో పనిచేస్తున్నాడు. తమ వివాహం ప్రేమ వివాహం. తను ఏ పని మీాద వెళ్ళినా ఎంత ఆలస్యం అయినా తనకోసం కనిపెట్టుకు కూర్చునేది శ్యామల. బయట తన కెన్ని ఆశాభంగాలు కలిగినా, ఎన్ని కష్టాలు వొచ్చినా యింటికాడ వున్నంతసేపూ శ్యామల పరిచర్యలవల్ల మనస్సు ప్రశాంతంగా ఉండేది. ఆమె తన భార్య అవటంవల్ల అనుకున్నాడు....

ఆమెను గృహానికి రాణిని చెయ్యాలనుకున్నాడు. గృహాన్ని అలంకరించటం మొదలుకొని కూరలు చెయ్యటం వరకు ఆమెకే విడిచిపెట్టాడు. ఏమీా జోక్యం కలిగించుకునే వాడుకాదు. ఆమె యింటి విషయం ఏదన్నా అడిగితే, 'నీ యిష్టం ఇంటి విషయాలలో నీకు సర్వస్వాతంత్ర్యం ఇచ్చాను' అన్నాడు బైటవిషయాలలో తను సర్వస్వతంత్రుడు. బయట విషయాలలో స్త్రీ జోక్యం కలిగించుకోవటం ఇంటి విషయాలలో పురుషులు జోక్యం కలిగించుకోవటం తప్పని అతని దృఢ విశ్వాసం. ఆ భేదం ప్రకృతి భేదం. ఇలా జరుగుచుండగా, ఒకనాడు తన బావమరది వొచ్చాడు. అతడు

మరొక రాజకీయపార్టీకి చెందినవాడు. తన కుటుంబ జీవితం చూచి ఇలా అన్నాడు :

"నీతోపాటు శ్యామలనుకూడా రాజకీయాల్లో ప్రవేశ పెట్టు బావా!"

అప్పుడు తన వుద్దేశాలన్నీ బావమరదితో చెప్పాడు.

'స్త్రీ స్వాతంత్ర్యం' అంటే స్త్రీ పురుషులతో పోటీ చెయ్యటం కాదు. జన్మతః స్త్రీకీ పురుషునికి భేదాలున్నాయి. తమ తమ స్వభావాలవల్ల పురుషుడు ప్రజాహిత జీవితానికి, స్త్రీ సంసారజీవితం సరిదిద్దటానికి అర్హులు. కాబట్టి స్త్రీ సంసారిక జీవితాన్ని, పురుషుడు ప్రజాహిత జీవితాన్ని నడపాలి. అటువంటి దాంపత్యమే ఆదర్శ దాంపత్యం అవుతుంది లేకపోతే సామరస్యం వుండదు. భార్యాభర్తల మధ్య ద్వేషం ప్రబలిపోతుంది. జీవితం దుర్భరం అవుతుంది స్త్రీకి జ్ఞానం సంపాదించాలని వుంటే, ఇంట్లోవుండే వార్తాపత్రికలు తెప్పించుకొని చదువుకోవచ్చు. అంతేగాని ప్రజోద్యమాల్లోకి స్త్రీ దిగటం మంచిదికాదు.

ఈ మాటలు విని తన బావమరది, "బావా ఈ నాటికి మీ జీవితం బాగానేవుంది. కాని క్రమేణా ప్రజోద్యమంలో పాల్గొంటున్న నీవు, ఒక రకం సంస్కారాన్ని, కుటుంబ జీవితానికి ముడిపెట్టుకొని కూర్చున్న శ్యామల మరొక సంస్కారాన్ని అలవరుచుకుంటారు. అప్పుడు సంఘర్షణ తప్పదు. మీ జీవితం మామూలు స్త్రీ పురుషుల దాంపత్య జీవితాల

కంటే అధోగతిపాలవుతుంది. నామాట విను. నీ అనుభవం లోకి వచ్చే సాంఘిక జీవనం శ్యామలకు అందుబాటులో వుండేటట్లు చెయ్యి. లేకపోతే ఏనాటికైనా పశ్చాత్తాపంతో మనస్సుని దగ్ధం చేసుకోవలసి వొస్తుంది" అన్నాడు.

అప్పుడతని మాటలకు తను మనస్సులో నవ్వుకున్నాడు. తన బావమరది, స్త్రీ పురుష భేదం లేకుండా రాజకీయాల్లో అందరూ పాల్గొనాలి అని చెప్పే పార్టీకి చెందినవాడు అవటం వల్ల అలా చెపుతున్నాడు అనుకున్నాడు. అలా ప్రవర్తించటం వల్ల ఆ పార్టీవారికి మోపబడిన నిందలు, నేరాలూ అప్పుడే ఎలా మరచిపోయాడూ? అని ఆశ్చర్యపడ్డాడు. పాశ్చాత్య నాగరికతను అనుకరించి చెడిపోయారని తేల్చుకున్నాడు.

కాని తను జీవితాన్ని తిరగవేసి చూసుకుంటే తన బావమరది చెప్పినట్లే జరిగింది.

తాను ప్రజోద్యమంలో తిరగటంవల్ల, అనేక అనుభవాలు కలిగినై. అనేకరకాల వ్యక్తులతో పరిచయం ఏర్పడింది అనేకభావాలు అనుభవంలోకి వొచ్చినై. పర్యవసానం దేశసేవే తనకు సర్వస్వం అయింది తన సర్వస్వం దేశసేవకు ధారపొయ్యాలనే నిశ్చయం కలిగింది. విశాల హృదయం ఏర్పడింది. అంటు కుటుంబజీవితపు హద్దులు దాటని శ్యామకు రోజులు గడిచినకొద్దీ స్వభావం సంకుచితం అవటం మొదలు పెట్టింది. ఆమెకు కుటుంబమే సర్వస్వం. ఆ హద్దుల అవతల అంధకారం, తనకు తను తన భర్తా; తమ సుఖమే సుఖం

అయింది. ఒకటి రెండుసార్లు భర్త డబ్బు ఎక్కువ ఖర్చు పెడుతున్నాడని తన అయిష్టత తెలియజేసింది.

"దేశంకోసం" అన్నాడుతను. కాని ఆమెకు ఈ జవాబు ఏమాత్రం తృప్తినీ ఇవ్వలేదు. కుటుంబము సంగతి చూచుకోవాలన్నది. ముందు కుటుంబం, తరువాత దేశం అన్నది. రోజులు గడచినకొద్దీ ఆమె ఇంకా మారిపోయింది. నగలు చేయించమని అడగటం మొదలుపెట్టింది. మొండిచేతులతో, మొండి మెడతో ఉండలేకుండా వున్నానన్నది. పదిమందీ నవ్వుతున్నారన్నది. అయ్యేది ఎట్లాగూ సర్వమంగళం అవుతూంది; కట్నంకింద పెళ్ళినాడిచ్చిన పది ఎకరాలు తన పేర పెట్టమన్నది. అదైనా జీవనాధారం అవుతుంది అన్నది.

ఆమె మారుతుందనే ధైర్యంతో తను అన్నీ సహించాడు. తను మారతాడనే నమ్మకంతో ఆమె అతని పనులు కొంతవరకు సహించింది.

కాని ఎవరూ మారలేదు. కుటుంబంలో కీచులాటలు బయలుదేరినై. తను ఖర్చుపెట్టే ప్రతిరూపాయకు పేచీపెట్టటం మొదలుపెట్టింది. కష్టపెట్టటమే ఆమెకు ఆనందాన్నిచ్చే స్థితికి వొచ్చింది.

ఇప్పుడు పులిమీదపుట్ర. తనూ యశోదా కలిసి చందాలు పోగుచేస్తున్నమాట నిజమే! కలిసి పనిచేస్తున్న మాటా నిజమే. కాని - తనభార్య - శ్యామల - తనను గురించి ఇంత నీచంగా ఆలోచిస్తుంది అని తను కలలోకూడా

అనుకోలేదు. ఆమె మారింది. ఆమె జీవితం, ఆమె స్నేహాలూ, ఆమెను పూర్తిగా మార్చివైవై. ఇప్పుడేం చెయ్యాలి? తనేం చెప్పినా ఆమె నమ్మదు. స్త్రీ పురుషు లిద్దరూ నిష్కల్మష హృదయాలతో కలిసి పనిచెయ్యటానికి వీలుందనే విషయం నమ్మటానికి అవసరమైన ఔదార్యం ఇప్పుడామెకు లేదు.

ఏం చెయ్యాలి? తనకూ తన శ్యామలకూ ఋణం తీరి నట్టేనా? తను బ్రతికి నన్నాళ్ళూ ఈ కళంకాన్ని మోస్తూ బ్రతకవలసిందేనా?

అతనికి తృటిలో ఇవ్వన్నీ జ్ఞాపకంవొచ్చినై. దుఃఖంతో వివశుడయ్యాడు. వెంటనే తన బావమరది చెప్పినమాటలు జ్ఞాపకం వొచ్చినై. క్రమేణా ప్రజోద్యమములో పాల్గొం టున్న నీవు వొకరకం సంస్కారాన్ని అలవరచుకుంటావు... అప్పుడు సంఘర్షణ తప్పదు. మీ జీవితం మామూలు స్త్రీ పురుషుల జీవితాలకంటే అధోగతిపాలవుతుంది. నా మాట విను.”

ఈ మాటలను జ్ఞాపకం తెచ్చుకొని తప్పంతా తనదే అనుకున్నాడు గోపాలం. కన్నీరు పెట్టుకుంటూ ‘స్వయం కృతం’ ‘స్వయంకృతం’ అనుకున్నాడు గద్గదిక స్వరంతో.